క్రాస్ ఓటింగ్ గుబులు

- కూటమికి కంటిమీద కునుకు కరువు
- ఎక్కడెక్కడ జరిగిందనే విషయమై సమాచార సేకరణ
- ప్రధాన గ్రామాలు లక్ష్యంగా ఆంతరంగిక చర్చలు

నిన్నటి వరకూ జబ్బలు చరిచిన టీడీపీ, కూటమి అంతర్మథనంలో పడ్డాయి. క్రాస్ ఓటింగ్ జరిగిందన్న ప్రచారం బాహాటంగా జరగడమే ఇందుకు ప్రధాన కారణం. కూటమి ప్రభావిత ప్రాంతాల్లోనే క్రాస్ ఓటింగ్ జరిగిందన్న సమాచారం బయటకు రావడంతో కూటమికి కంటి మీద కునుకు కరువైంది. దీంతో ప్రధాన గ్రామాలు లక్ష్యంగా ఓటింగ్ ప్రక్రియపై ఆంతరంగిక చర్చల్లో పెనమలూరు టీడీపీ, కూటమి మునిగిపోయింది.


కంకిపాడు ఎంపీపీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు(ఫైల్)

కంకిపాడు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగియడంతో గెలుపోటములపై భారీగా చర్చలు, సమీక్షలు జరుగుతున్నాయి. ఏ నలుగురు కలిసినా పోలింగ్ ఎలా జరిగింది?, ఎవరికి లాభం జరగనుంది? అన్నదే చర్చ. తాజాగా క్రాస్ ఓటింగ్ జరిగిందన్న ప్రచారం బాహాటంగా జరగడంతో కూటమి ఉలిక్కిపడుతోంది. వైఎస్సార్ సీపీ ఓటు చెదిరే అవకాశం లేదనేది ప్రజాస్వామ్య వాదుల భావన. దీంతో కూటమి ఓటే చెదిరిందన్నది తేలిపోవడంతో టీడీపీ నేతల వెన్నులో వణుకు మొదలైంది. నిన్నటి వరకూ నియోజకవర్గం వ్యాప్తంగా కమ్మగా కాపు కాశారని నమ్మి కూటమి నేతలు జబ్బలు చరిచారు. తీరా క్రాస్ ఓటింగ్ జరిగిందని విశ్లేషకుల ఊహాగానాలతో గుబులుతో బెంబేలెత్తిపోతున్నారు.

సొంత వాళ్లనే భావనతో..

పెనమలూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకూ జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను గమనిస్తే ఇదే రుజువైంది. పెనమలూరు అసెంబ్లీతో పాటుగా, మచిలీపట్నం పార్లమెంటు స్థానంలో ఎవరు పోటీలో ఉన్నారో చూసుకుని, కులాభిమానం చాటుతూ ఇరువురికీ సమన్యాయం చేసేలా ఇక్కడి ఓటర్లు వ్యవహరించడం పరిపాటిగా మారింది. గత ఎన్నికల్లో ఇక్కడ సుమారు నాలుగు వేల ఓట్లు పైగా కులాభిమానంతో క్రాస్ ఓటింగ్ జరిగినట్లు అంచనా. ఇదే పరిస్థితి ఈ దఫా కూడా పునరావృతం అవుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అది వైఎస్సార్ సీపీకి కలిసొచ్చే అంశంగా చెబుతున్నారు. ఇక కూటమి విషయానికొస్తే మొదటి నుంచి టీడీపీతో జనసేనలోని ఓ వర్గం కలిసి పనిచేయడం లేదు. కార్యక్రమాలకు సైతం దూరంగా ఉంటోంది. బీజేపీ విషయానికొస్తే కనీసం ప్రచార వాహనాలకు జెండాలు కట్టకపోవడం, జెండా కడితే ముస్లిం ఓటు బ్యాంకు పోతుందనే వాదన వినిపించడంతో బీజేపీ శ్రేణులు ప్రచారానికి సైతం దూరంగా ఉన్నారు. ఇవన్నీ టీడీపీ, కూటమికి ప్రతికూల అంశాలుగా మారాయి. మరీ ముఖ్యంగా పెనమలూరు మండలం యనమలకుదురు, పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు ప్రాంతాల్లోని కాపు సామాజిక వర్గం అభిమానాన్ని చాటుకుని, స్థానికంగా సంక్షేమానికి పట్టం కట్టారనే అంచనాలు బహిరంగంగా ప్రచారంలో ఉన్నాయి. ఈ ప్రభావం కూటమికి ప్రతికూలంగా ఉంటుందని అంచనాలు వేస్తున్నారు. దీంతో రెండు రోజులుగా టీడీపీ నేతలు తమ ప్రధాన ప్రాంతాల్లో ఓటింగ్, నేతల వ్యవహారం, ఓటర్ల నాడి తెలుసుకునే పనిలో పడ్డారు. క్రాస్ ఓటింగ్ జరిగిందా? లేదా?, జరిగితే ఎటు మొగ్గు అన్న అంచనాలు కట్టడంలో మునిగిపోయారు.

క్లుప్తంగా

చినకంచిలో శ్రీసీతారామ కల్యాణం



నున్న(విజయవాడరూరల్): చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి దేవస్థానం చినకంచిలో శనివారం శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. రామాయణంలో పేర్కొన్న విధంగా వైశాఖ శుద్ధదశమి నాడు శ్రీసీతారామ కల్యాణం జరిగిందని, ఆ ప్రకారం చినకంచిలో కూడా నిర్వహించినట్లు దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలియజేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తలంబ్రాలు పోసి తీర్థప్రసాదములు స్వీకరించారు.

కానూరులో విద్యార్థి అదృశ్యం

పెనమలూరు: కానూరులో ఇంటర్ చదువుతున్న విద్యార్థి అదృశ్యమయిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు అశోక్‌నగర్‌కు చెందిన చెన్నుపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతని కుమారుడు లీలాకృష్ణ ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షల్లో ఫేయిల్ అవ్వడంతో ఇంట్లో ఉండి చదువుతున్నాడు. అతను సక్రమంగా చదవకపోవడంతో కుటుంబసభ్యులు మందలించారు. కాగా లీలాకృష్ణ ఈ నెల 15వ తేదీన ఇంటి నుంచి వెళ్లి పోయాడు. అతని కోసం కుటుంబసభ్యులు వెతికినా అతని ఆచూకీ తెలియలేదు. దీంతో తండ్రి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దంత సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి



గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శనివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. గన్నవరానికి చెందిన స్టార్ డెంటల్ క్లినిక్ సౌజన్యంతో వాకర్స్‌కు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. తొలుత వైద్య శిబిరాన్ని సర్పంచి నిడమర్తి సౌజన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వాకర్స్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ మాట్లాడుతూ.. వాకర్స్ ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రతి నెలా మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దంత సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు డాక్టర్ గుర్రం ధనప్రకాష్, కాట్రగడ్డ సావేరి సూచించారు. న్యాయవాది తిరివీధి వెంకయ్య, అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ లోయ సురేంద్ర, కోశాధికారి బోకినాల కోటేశ్వరరావు, వాకర్స్ పెద్దలు కెఎస్.బాబురావు, ధనియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత ఆళ్లకు పోలీసు నోటీసులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంకు చెందిన టీడీపీ నేత ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావుకు వీరవల్లి పోలీసులు 149 సీఆర్‌పీసీ నోటీసులు శనివారం అందించారు. కొత్త మల్లవల్లి పోలింగ్ కేంద్రం వద్ద చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై పోలీసులు స్పందించారు. ఆళ్ల వ్యాఖ్యలు కొన్ని వర్గాల వారిని రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించే విధంగా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని పేర్కొంటూ నోటీసులు అందించారు. ఎన్నికల నియామావళి అమలులో ఉన్నందున నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా మహాశాంతి హోమం


ఉయ్యూరు వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి జోగి రమేష్


టీస్టాల్ వద్ద టీ తాగుతూ స్థానికులతో ముచ్చటిస్తున్న మంత్రి జోగి రమేష్

- ఉయ్యూరులో లోక కల్యాణార్థం విశేషంగా పూజలు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీవేణుగోపాలస్వామి, పంచ పట్టాభిరామ స్వామి ఆలయాల్లో మండల అభిషేక మహోత్సవాలు, మహాశాంతి హోమం పూజా కార్యక్రమాలను శనివారం వైభవంగా నిర్వహించారు. నూతనంగా పునర్నిర్మాణం చేసిన ఆలయాల్లో లోక కల్యాణార్థం విశేష పూజా కార్యక్రమాలు జరిపించారు. వేద పండితులు అభిషేక, మహాశాంతి హోమాలు చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ పూజా కార్యక్రమాల్లో పాల్గొని వేణుగోపాలస్వామి, పంచ పట్టాభి రామస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మంత్రి రమేష్‌కు పాలకవర్గం, పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి రమేష్ మాట్లాడుతూ స్వామివారి చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. లోక కల్యాణార్థం హోమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ సోలే సురేష్‌బాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మండల అధ్యక్షుడు దాసే రవి, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, కౌన్సిలర్లు డాక్టర్ జంపాన పూర్ణిమ, ముడావత్ లక్ష్మి, గోన మదన్, ఎండీ బేగ్, గుంజా సుధాకర్, సర్పంచ్‌లు తుమ్మూరు సురేష్‌రెడ్డి, పొనుగుమాటి బాలస్వామి, నాయకులు అబ్దుల్ సద్దాం, పాగిరి రాము, షేక్ ఖలీల్, బాబ్జీ, గెత్తం విజయ్‌కుమార్, సలీం బేగ్, కొండపల్లి రమేష్, దిరిశం ఇందిరా ప్రియదర్శిని, బాలి పాల్గొన్నారు.

పట్టణ వాసులతో ఇష్టాగోష్ఠి..

ఉయ్యూరులో శనివారం పర్యటించిన మంత్రి జోగి రమేష్ పట్టణ వాసులతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. జంపాన బసవయ్య టీస్టాల్ వద్ద ఆగి టీ తాగుతూ ఓటింగ్‌సరళిపై ఆరా తీశారు. దివ్యాంగులను ఆప్యాయంగా పలకరిస్తూ, చిన్నారులతో ముచ్చటించారు. పార్టీ శ్రేణులతో పాటుగా అన్ని వర్గాలను కలిసి మాటా మంతీ మాట్లాడారు.

నున్నలో పిల్లలకు వ్యాక్సిన్

నున్న(విజయవాడరూరల్): పిల్లల్లో వ్యాధులు రాకుండా ఉండేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం నున్న గ్రామంలోని సచివాలయం-1, 2లో వైద్యసిబ్బంది పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. ప్రతి నెలా మూడో శనివారం సచివాలయాల్లో పిల్లలకు పోలియో, గోరింత దగ్గు, గర్భిణీ స్త్రీలకు ధనుర్వాతం, 10వ నెల పిల్లలకు పొంగు రాకుండా ఉండేందుకు వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని మండల మల్టీపర్పస్ అండ్ హెల్త్ ఎక్స్‌టెన్షనల్ ఆఫీసర్ పెద్దిరావు తెలిపారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. పుట్టిన నెలలోపు పిల్లలకు క్షయవ్యాధి రాకుండా బీసీజీ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. 5, 10, 16 సంవత్సరాల పిల్లలకు ధనుర్వాతం, డిఫ్తీరీయ వ్యాధులు రాకుండా వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఏఎన్ఎమ్స్, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.


పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

పెనమలూరులో భారీ వర్షం

పెనమలూరు: పెనమలూరు మండల పరిధిలో శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగినా భారీ వర్షంతో రోడ్లు జలమయమవ్వడంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండల పరిధిలో శనివారం ఉదయం భారీ మేఘాలు కమ్ముకుని పెద్ద వర్షం పడింది. ఒక్కసారిగా వర్షం కురవడంతో వేసవి తాపం నుంచి జనాలు బయటపడ్డారు. అయితే విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డుపై భారీగా వర్షం నీరు చేరింది. పోరంకి, కామయ్యతోపు, పప్పుల మిల్లు ప్రాంతాల్లో వర్షం కురిసిన సమయాల్లో తరచుగా జాతీయ రహదారిపై నీరు చేరి పరిస్థితులు దారుణంగా మారుతున్నాయి. కాగా భారీగా కురిసిన వర్షంతో గ్రామాల్లో ప్రజలు ఉపశమనం పొందారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు ఉంటాయని ప్రకటించడంతో గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేసుకున్నారు.


పోరంకిలో జాతీయ రహదారిపై చేరిన వర్షం నీరు

కంకిపాడులో..

కంకిపాడు: ద్రోణి ఆవర్తనం కొనసాగుతోంది. దీంతో మూడు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. శనివారం కూడా కంకిపాడు పరిసర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో రైతాంగం పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకునేందుకు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. మొక్కజొన్న రైతులు మాత్రం మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన పంటను వర్షం బారిన పడి దెబ్బతినకుండా సంరక్షించుకుంటున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: కానూరులో యువతి అదృశ్యమవ్వడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌కు చెందిన షేక్ నసేరా కుటుంబ సభ్యులతో ఉంటుంది. భర్త బాజీ ఆటోనగర్ స్టీల్ కంపెనీలో పని చేస్తాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు. వీరిలో ఒక కుమార్తె (18) కామయ్యతోపులో నర్సింగ్ చదువుతుంది. కాగా ఈ నెల 15వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సర్వీసు రోడ్డా..? డంప్ యార్డా..?

కంకిపాడు: సర్వీసు రోడ్డు డంప్ యార్డును తలపిస్తోంది. వెదజల్లుతున్న దుర్గంధానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యర్థాలు గుట్టలుగా మేట వేసుకుపోతున్నా స్థానిక సంస్థల అధికారులు పట్టించుకోవడం లేదు. వాహనదారుల అవస్థలకు కంకిపాడు బైపాస్ మార్గంలోని సర్వీసు రోడ్డు కేరాఫ్‌గా మారింది. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా కంకిపాడు వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణం చేశారు. కంకిపాడు (గోసాల పరిధి నుంచి), కంకిపాడు ఊరు చివర చెత్త డొంక వరకూ ఉన్న మార్గం వెంబడి వాహనదారుల సౌకర్యార్థం సర్వీసు రోడ్డు నిర్మించారు. ఇంత వరకూ బాగానే ఉన్నా ఆ సర్వీసు రోడ్లపై అటు జాతీయ రహదారుల శాఖ, ఇటు స్థానిక సంస్థలు పర్యవేక్షణను విస్మరించాయి. ఫలితంగా సర్వీసు రోడ్డు కాస్తా ప్రస్తుతం డంపింగ్ యార్డుగా మారిపోయింది. పెనమలూరు, కంకిపాడు మండలాల్లోని పలువురు వ్యాపారులు వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడ గుట్టలుగా పోస్తున్నారు. ప్రజల అవస్థలను గుర్తించి సర్వీసు రోడ్డుపై అధికారులు పర్యవేక్షణ వహించాలని స్థానికులు కోరుతున్నారు.


కంకిపాడు సర్వీసురోడ్డు వెంబడి పేరుకుపోయిన వ్యర్థాల గుట్టలు

పాదరక్షల పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవసేవే మాధవసేవగా భావించి ఫేస్‌బుక్ మిత్రులంతా కలిసి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మమతల పందిరి సేవా సమితి అధ్యక్షుడు లంక రమేష్ తెలిపారు. బాపులపాడు మండలంలోని వీరవల్లి, హనుమాన్‌జంక్షన్‌లో పలు ప్రాంతాల్లో వృద్ధులు, యాచకులు, అంగన్‌వాడీ చిన్నారులకు ఉచితంగా పాదరక్షలను శనివారం పంపిణీ చేశారు. మమతల పందిరి సేవా సమితి ఉపాధ్యక్షుడు వీసం శ్రీనివాస్, సభ్యులు పరుచూరి రామకృష్ణ, ఈడ్పుగంటి విజయలక్ష్మి, కొడాలి అనురాధ, రత్నకుమారి, పటమట రామకృష్ణ పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు

- రౌండ్‌కు 14 టేబుళ్లు
- 22 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి
- పోస్టల్ బ్యాలెట్ ప్రత్యేక లెక్కింపు



కృష్ణా వర్సిటీలో పెనమలూరు నియోజకవర్గ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేసిన దృశ్యం



స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ఈవీఎంలు

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు పూర్తి స్థాయిలో సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. వారికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి డి.రాజు ఈ మేరకు శనివారం వివరాలు వెల్లడించారు. పెనమలూరు నియోజకవర్గ పరిధిలో పార్లమెంట్, అసెంబ్లీ కౌంటింగ్ వచ్చే నెల నాలుగో తేదీన కృష్ణా యూనివర్సిటీలో జరుగుతుందన్నారు. ఇప్పటికే యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలు భద్ర పరిచామని అన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో పాస్‌లు ఉన్న ఏజెంట్లను మాత్రమే ఓట్ల లెక్కింపులోకి అనుమతిస్తామని తెలిపారు.

ఓట్ల లెక్కింపు ఇలా..

ఓట్ల లెక్కింపు పార్లమెంట్, అసెంబ్లీ వేరువేరుగా లెక్కిస్తారు. పార్లమెంట్‌కు 14 టేబుళ్లు, అసెంబ్లీకి 14 టేబుళ్లు వేరువేరుగా వేస్తారు. పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం 306 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 14 టేబుళ్లపై వీటిని లెక్కించాలంటే దాదాపుగా 22 రౌండ్ల సమయం పడుతుంది. ఒక్కో టేబుల్‌కు సూపర్‌వైజర్‌తో పాటు మరో ఇద్దరు సిబ్బంది ఉంటారు. అంటే 42 మంది సిబ్బంది ఓట్ల లెక్కింపులో పాల్గొంటారు. వీరికి అదనంగా 10 మంది సిబ్బంది రిజర్వులో ఉంటారు. ఓట్ల లెక్కింపు ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుంది. రెండు రౌండ్లలో ట్రెండ్స్ తెలుస్తాయి. మధ్యాహ్నం కల్లా ఓట్ల లెక్కింపు ముగుస్తుంది. ఫలితాలు రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారు.

పోస్టల్ బ్యాలెట్లు..

పెనమలూరు నియోజకవర్గంలోని పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు కూడా కృష్ణా యూనివర్సిటీలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. అధికారుల లెక్కల ప్రకారం 3,587 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ అయ్యాయి. వీటి లెక్కింపు కోసం ఏఆర్‌ఓ సమక్షంలో ఐదు ఓట్లు లెక్కింపు టేబుళ్లు ప్రత్యేకంగా వేస్తారు. ఒక పక్క ఈవీఎంల లెక్కింపు జరిగితే మరో పక్క పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూడా లెక్కింపు జరుగుతుంది.

గ్రంథాలయాలతో విజ్ఞాన వికాసం సాధ్యం


తెన్నేరు శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీల్లో చిన్నారులు


ఉయ్యూరు గ్రంథాలయంలో కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు


మానికొండలో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

కంకిపాడు: గ్రంథాలయాలతో విజ్ఞానం, వికాసం సాధ్యమని తెన్నేరు శాఖా గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ, పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఎన్నో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పుస్తక పఠనం అలవర్చుకోవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం జరుగుతుందన్నారు. చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులను అభినందించారు.

వణుకూరు గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ

పెనమలూరు: వణుకూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, ఆటలు ఆడించడం చేశామని గ్రంథాలయ అధికారి భారతి తెలిపారు. గ్రామంలోని విద్యార్థులు గ్రంథాలయ సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. తల్లితండ్రులు కూడా విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలను వారి పిల్లలను పంపాలని కోరారు.

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జ్ గ్రంథాలయాధికారి డి.బాబురావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో విద్యార్థులకు ఆటపాటలతో పాటు విద్య పరమైన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ ఏడో తేదీ వరకు వేసవి శిబిరం జరుగుతుందన్నారు.

ఉయ్యూరు: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఉయ్యూరు, కాటూరు, ముదునూరు, పెద ఓగిరాల గ్రంథాలయాల్లో శిక్షణా తరగతులకు విద్యార్థులు హాజరై వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో శనివారం కథల పుస్తకాలను చదివించారు. రీసోర్సు పర్సన్ కె.నాగలక్ష్మి, గ్రంథాలయాధికారి రమణి పర్యవేక్షించారు.

గన్నవరం రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని ముస్తాబాద లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి అన్నారు. శనివారం మండలంలోని ముస్తాబాద, పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరాలను గ్రంథాలయం శాఖ ఏర్పాటు చేసిందని, విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. రిటైర్డ్ రైల్వే ఉద్యోగి ఎం.ఆంజనేయులు, పురుషోత్తపట్నం గ్రంథాలయ లైబ్రేరియన్ కృపానందం తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలో జిల్లా శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా తరగతులు ఉల్లాసంగా కొనసాగుతున్నాయి. శనివారం మానికొండ గ్రంథాలయ అధికారి ఎల్.హరికృష్ణ గ్రంథాలయాల విశిష్టతను, పుస్తక పఠనం ఆవశ్యకతను వివరించారు. గణితంలో పజిల్స్, సుడోకో, చదరంగం, క్యారమ్స్ వంటి ఆటలు నిర్వహించారు. అదేవిధంగా తేలప్రోలు, ఉంగుటూరు, ఆత్కూరు గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా తరగతుల్లో వివిధ పోటీలను నిర్వహించారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి


సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు


యనమలకుదురులో పూజలు..

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని ఆలయాన్ని రకరకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వాసవీ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు, వాసవీ హోమం చేశారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక వాహనంతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపులో మహిళల కోలాటం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఆర్యవైశ్య ప్రముఖులు పైడి సుధాకర్, తవ్వా పూర్ణచంద్రరావు, చామర్తి రాంబాబు, కొనకళ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

యనమలకుదురులో..

పెనమలూరు: యనమలకుదురులో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పెనమలూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని రామాలయంలో శ్రీ వాసవీ దేవికి సాయంత్రం ఆరు గంటలకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బుద్ధా లక్ష్మణకుమార్, కొండవేటి బాబూరావు, తటపర్తి సతీష్, బచ్చు నరసింహారావు, నాళ్ల శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సమితి, జ్ఞానమందిర యోగ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విజయవాడ పైపులరోడ్డు సెంటర్‌లో మజ్జిగ పంపిణీ చేశారు.